ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణకు మద్దతు తెలపాలని వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక సీఎండీ డా. కాచం సత్యనారాయణను కోరుతున్న ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకుడు జీ భరత్.

- విశ్వంభర, హైదరాబాద్

కాంగ్రెస్ నాయకులు ఖబర్దార్..

కార్యాలయాలు, ఇండ్లపైకి వస్తామంటే భయపడేది లేదు : కవిత

విశ్వంభర, హైదరాబాద్: కాంగ్రెస్ నాయకులు ఖబర్దార్ అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు, ఇండ్లపైకి దాడులకు వస్తామంటే భయపడే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. యాదాద్రి భోనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ అని.. కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి ఉండదు.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరని స్పష్టం చేశారు. రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాదని.. మాటలతో, విజ్ఞతతో, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసే సంస్కృతి బీఆర్ఎస్‌దన్నారు.

మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరు?

మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు మూసిలో కలుస్తుంటే 60 ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసింది? అని నిలదీశారు. మూసి నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే ఎస్టీపీలను ఏర్పాటు చేయడమే కాకుండా.. గోదావరి నదితో అనుసంధానం చేయాలనుకున్నారన్నారు. మూసిలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మూసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారన్నారు. మూసిని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చాలని చూస్తున్నారన్నారు. హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండపోచమ్మ సాగర్‌ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసి - గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు.

వేలకోట్ల ప్రజాధనం వృథా

రూ.7500 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. కొండపోచమ్మ నుంచి మూసి అన్నసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పుడు ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకు? అంటూ ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళన పేరిట పేద ప్రజల ఇళ్లను కూల్చివేత కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు. పేద ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం .. మూసి ప్రక్షాళనకు అయ్యే వ్యయం రూ.50 వేల కోట్లు అని ఒకసారి, రూ.లక్ష కోట్లు అని మరొకసారి, లక్షన్నర కోట్లు అని ఇంకోసారి సీఎం చెబుతున్నారన్నారు.

డబ్బులు ఢిల్లీకి పంపే ప్రణాళిక..

మూసిని ఏటీఎంగా మార్చుకొని.. వచ్చే డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక సీఎం వేసుకున్నారని విమర్శించారు. యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పారద్రోలేందుకు కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారన్నారు. ఫ్లోరైడ్‌ని నిర్మూలించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనేక సంవత్సరాలు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఒక వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన పోలేదని విమర్శించారు.

నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తాం

విశ్వంభర, నారాయణపూర్ : ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామసభల నిర్వహణలో భాగంగా గంగాధర మండలం నారాయణపూర్ లో ఏర్పాటు చేసిన గ్రామ సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి, నీటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

నారాయణపూర్ రిజర్వాయర్ ను సందర్శించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తక్కువ ఆయకట్టుకు నీరిచ్చిందని అన్నారు. ఈ ప్రభుత్వం తక్కువ ఖర్చులో ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నదని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రాజెక్టుల జాబితాలో నారాయణపూర్ రిజర్వాయర్ ను చేరుస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి అవసరమైన సుమారు 70 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని తెలిపారు. ఏడాదిలోగా ప్రాజెక్టు పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీళ్లు అందిస్తుందని అన్నారు. రిజర్వాయర్ ముంపు విషయంలో నారాయణపూర్ ప్రజలకు న్యాయం చేస్తామని తెలిపాడు. నారాయణపూర్ లో నాలుగు ప్రభుత్వ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికి పథకం వర్తించేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు వెలుగును నింపేందుకు తమ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందని వివరించారు. రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 10 సంవత్సరాలుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్న వారందరికీ కార్డు అందుతుందని తెలిపారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఈనెల 26న మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

జనవరిలోనే ఎల్లంపల్లి జలాలు విడుదల..

గతంలో ఎప్పుడూ లేనివిధంగా జనవరి మాసంలోనే నారాయణపూర్ జలాశయానికి ఎల్లంపల్లి నీరును జనవరి నెలలోనే తీసుకువచ్చామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చొప్పదండి నియోజకవర్గంలో జల యజ్ఞంలో భాగంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ జలాశయానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. 90 శాతం పనులు కూడా పూర్తి చేసిందని అన్నారు. మిగిలిన 10 శాతం పనులను సర్కారు పట్టించుకోలేదని అన్నారు. నారాయణపూర్ జలాశయం పనులన్నీ పూర్తి చేస్తామని వివరించారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు గతంలో సమర్పించిన దరఖాస్తులన్నీ పరిగణలోకి తీసుకున్నామని అన్నారు. అర్హులుగా ఉన్న వారి పేరు గ్రామసభలో లేకపోతే అక్కడే దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. చాలా ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రేషన్ కార్డుల ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రపోజ్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జడ్పీ సీఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ పాల్గొన్నారు.

సరూర్ నగర్ సరస్సు వద్ద మెగా క్లీన్లీనెస్ డ్రైవ్

విశ్వంభర, ఎల్బీనగర్: స్వచ్ఛ్ భారత్ మిషన్ కింద స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సరూర్ నగర్ సర్కిల్ ఎల్బీ నగర్ జోన్, సర్కిల్ 5 లోని సరూర్ నగర్ సరస్సు వద్ద మెగా క్లీన్లీనెస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా పలు విద్యాసంస్థలు ఈ డ్రైవ్ లో పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో నీటి వనరులను సంరక్షించడంలో సమాజ భాగస్వామ్యం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, ఆకుల శ్రీవాణి, దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సుజాత, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ 5,. సేవా ఇస్లావత్, డిప్యూటీ కమిషనర్, సర్కిల్ 4 కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలి

విశ్వంభర, భూపాలపల్లి : గణతంత్ర దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై బుధవారం అన్ని శాఖల అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల ద్వారా స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు అందించడానికి 23వ తేదీ వరకు జాబితా ఇవ్వాలని సూచించారు. వేడుకలకు సంబంధించి ప్రోటోకాల్ పాటిస్తూ అతిథులు కూర్చోడానికి అనువుగా షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేయాలని, స్టేజ్ ఏర్పాట్లు, త్రాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను సంబంధిత శాఖ అధికారులు అంబేద్కర్ స్టేడియం లో పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లా ప్రగతి సందేశమును తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వేడుకల సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో దేశభక్తి గీతాలపై నృత్య ప్రదర్శనలు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల చే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీపీఆర్వో ను, డీఈఓను కలెక్టర్ ఆదేశించారు. వేడుకల సందర్భంగా అంబులెన్సులు, అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంచాలని అన్నారు. మైదానంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీపీఆర్వో శ్రీనివాస్, డీఈఓ రాజేందర్ మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా మొయినుద్దీన్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమ శాఖ క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క

విశ్వంభర, హైదరాబాద్: సచివాలయం లోని తన చాంబర్ లో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా శిశు సంక్షేమ శాఖ క్యాలెండర్ ను మంత్రి సీతక్క ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అకేశ్వరరావు, సెక్రటరీ షబానా, ఆర్గనైజింగ్ సెక్రటరీ జ్యోత్స్న, ఇతర అధికారులు హాజరయ్యారు. అందరు బాగా పనిచేయాలని, మహిళలకి సత్వర సేవలందించేందుకు అధికారులు ముందుండాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సీతక్క సూచించారు. మాది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వం, న్యాయబద్ధంగా మీకు రావలసిన అన్ని సదుపాయాలను కల్పిస్తాం..ప్రజా పాలన లక్ష్యాన్ని ప్రజలకు చేరవేయాల్సింది ప్రభుత్వ ఉద్యోగులే.. ఉద్యోగాన్ని బాధ్యతగా నిర్వర్తించండి. ప్రభుత్వం వేరు ఉద్యోగులు వేరు కాదని సీతక్క స్పష్టం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

విలీన గ్రామాలు అభివృద్ధే ధ్యేయంగా అడుగులు

విశ్వంభర, వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని వంగపహాడ్, గుండ్ల సింగారం, భగత్ సింగ్ నగర్, విజయలక్ష్మి కాలనీ, పెగడపల్లి గ్రామాలలో 3 కోట్ల 31లక్షల రూపాయల స్మార్ట్ సిటీ నిధులతో సీసీ రోడ్లు డ్రైనేజ్ నిర్మాణ పనులకు నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. మహిళల, కోలాటాల నడుమ బైక్ ర్యాలీతో ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి గజామాలతో సత్కరించారు. తొలుత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి రేవంతన్న నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమం జోడేడ్ల మాదిరి సాగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు అందిచమని మళ్ళీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వంలో త్వరలో అర్హులకు రేషన్ కార్డులను,డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారికీ ప్రభుత్వం సన్నద్ధం అవుతుందాన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్నీ గుర్తు చేశారు.. అలాగే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం మన ప్రజా ప్రభుత్వం, రైతులకు ఈ నెల 26 నుంచి ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకం క్రింద ఏడాదికి 12000 మన ప్రజా ప్రభుత్వం ఇవ్వనున్నది. మాటల ప్రభుత్వం కాదు ఇది చేతల ప్రభుత్వం దయచేసి ప్రజలందరూ బీఆర్ఎస్ , బీజేపీ నాయకుల మాయమాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని హక్కున చేర్చుకోవాలని అన్నారు. డివిజన్ల లో సైడ్ డ్రైన్, సీసీ రోడ్ల పనులను చేస్తున్నామని రోడ్డు నిర్మాణ పనుల్లో స్థానిక కాలనీ వాసులు ప్రభుత్వానికి

సహకరించాలని కోరారు. కాలనీలలో ఎటువంటి సమస్యలు ఉన్ననా దృష్టికి కానీ నా డయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 కి ఫోన్ చేసి మీ సమస్య వివరిస్తే వీలైనంత త్వరగా పరిష్కరం చేసే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగళి వెంకట్రామ్ నరసింహ రెడ్డి, ఆత్మకూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ లావుడ్య రవి నాయక్, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగిలాల్, పాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్, మండల అధ్యక్షుడు మదాసి అజయ్, డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, మాజీ ఎంపీటీసీ మార్త రవీందర్, గ్రామ పార్టీ అధ్యక్షులు నాలుబోల రవీందర్, తారమ్మ, సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ పుట్ట తిరుపతి, సీనియర్ నాయకులు పొలం అనిల్ రెడ్డి, నమిండ్ల భాస్కర్, ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల అమలు తర్వాతనే సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఉస్మాన్

విశ్వంభర, మెట్ పల్లి: జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో విలేకరులతో ఎం డి ఉస్మాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేసిన తరువాత మిగతా సంక్షేమ పథకాల గురించి ఆలోచించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఉస్మాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మెట్ పల్లి మండల కేంద్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలను అమలు చేయాలని కోరుతూ ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా మిగిలిన పథకాల అమలుకు అర్హులను ఎంపిక చేయాలంటే రేషన్ కార్డ్ దే ఆధారం అని అన్నారు. కొత్త రేషన్ కార్డులను అమలుచేయకుండా లబ్ధిదారులను ఎంపిక చేయటం వల్ల ప్రజలలో గందరగోళం నెలకొందన్నారు. ఈ పరిస్థితి వల్ల నిజమైన లబ్ధిదారులు నష్టపోయే అవకాశం మెండుగా ఉందన్నారు. కావున కాంగ్రెస్ పార్టీ పెద్దలు ఈ విషయంపై స్పందించి ముందు రేషన్ కార్డులను మంజూరు చేసిన తర్వాతనే రేషన్ కార్డుల ఆధారంగా ప్రభుత్వ పథకాలలో లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎండీ ఉస్మాన్ కోరారు.

ప్రగల్భాలు ఆపి నిధులు కేటాయించండి

విశ్వంభర, ఎల్బీనగర్: హైదరాబాద్ మహా నగరాన్ని ఇస్తాంబుల్, దల్లాస్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రగల్భాలు పలుకుతున్నారని, జీహెచ్ఎంసీల వీధిలైట్లు పోతేనే వేసే నాధుడు కరువయ్యడని తెలంగాణ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ బీబీఆర్ వేణు అన్నారు. బుధవారం ఆర్కేపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని జీహెచ్ఎంసీ ప్రాంతాలలో వీధి లైట్లు వెలగడం లేదని అన్నారు.

ఇదే విషయాన్ని అధికారులను అడిగితే ఈ ఈ ఎస్ ఎల్ అనే ఏజెన్సీ మెయింటినెన్స్ చేస్తున్నది అని వారికి బిల్లులు ఆపేయడంతో, మూడు నెలల నుండి ఈ ఏజెన్సీ ఎక్కడ కూడా వీధిలైట్లు కాలిపోయిన, వెలగకపోయినా పట్టించుకోవడం మానేసింది అన్నారు. కాలనీలలో బస్తీలలో లైట్లు వెలగక చీకటమయమైపోయాయి కానీ మూడు నెలల నుండి జీహెచ్ఎంసీ కమిషనర్ గాని, సంబంధిత మంత్రి గానీ పట్టించుకున్న పాపనా పోలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రపంచంలోనే హైదరాబాదును ఉన్నత స్థానంలో నిలబెడుతానాని ప్రగల్భాలు పలుకుతున్నాడు అని ఎద్దేవ చేశారు. యుద్ధ ప్రాతి పదికన మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల బీజేపీ హైదరాబాద్ పట్టణ ప్రజల తో కలిసి జీహెచ్ఎంసీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందులో రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విశ్వంభర, కాళేశ్వరం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం లో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లేతకరి రమ్య రాజబాబు ఆధ్వర్యంలో దుద్దుల శ్రీపాద స్మారక క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో గెలుపొందిన మాజా లెవెన్ టీంకు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి పూసుకుపల్లి టీమ్ కు శ్రీపాద ట్రస్ట్ ఛైర్మన్ దుద్దిల్ల శీను బాబు బహుమతులు అందజేశారు. అంతకుముందు పోలీస్ ప్రెస్ మరియు పొలిటికల్ లీడర్స్ తో కలిసి శీను బాబు ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. అనంతరం టోర్నీ నిర్వాహకులు లేతకరి రమ్య రాజబాబు దుదిల్ల శ్రీను బాబు చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోట రాజబాపు, చల్ల తిరుపతి,కామిడి శ్రీనివాస్ రెడ్డి, మెంగని అశోక్, గంధసరి మధుసూదన్, గంధసిరి సత్యనారాయణ, పంతకాని సమ్మయ్య, బందేల సత్తమ్మ, రేవల్లి మమత, సిఐ రామచంద్రరావు, ఎస్ఐ తమాషా రెడ్డి, కాళేశ్వరం ప్రెస్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలం

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు

విశ్వంభర, జూలూరుపాడు: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి నేటికీ ప్రతి హామీలు అమలు చేయలేదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వైరా నియోజకవర్గ నాయకులు లకావత్ గిరిబాబు. బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజలు వస్తున్న వ్యతిరేకతను తప్పిపుచ్చుకునేందుకు గ్రామ సభల పేరుతో ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేస్తుందన్నారు. ప్రజా పాలనకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ జోక్యం లేకుండా గ్రామ సభల ద్వారా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పుష్కరాల అభివృద్ధి పనులు ప్రారంభం

విశ్వంభర, కాళేశ్వరం: దక్షిణ కాశీగా వెలుగొందుతున్న భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం కాళేశ్వరం లో మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతీ పుష్కరాల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. సరస్వతీ పుష్కరాలపై రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్య, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి పుష్కరాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పుష్కరాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 25 కోట్ల నిధులు విడుదల చేయడంతో ఆలయ ప్రధాన తూర్పు ద్వారం నుండి మెయిన్ రోడ్డు వరకు రోడ్డును వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ తో మెట్లు నిర్మించనున్నారు. అలాగే వీఐపీ ఘాట్లో సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్టింప చేయనున్నారు. చాలా సంవత్సరాల క్రితం ఆలయ ఆవరణలో నిర్మించిన గెస్ట్ హౌస్లను కూల్చివేసి కొత్త రూములు నిర్మించనున్నారు.